సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023



కష్టపడి చదివితే భవిష్యత్

విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి చదివితే అనుకున్న ఉద్యోగాలను సాధించగలరని వక్తలు అభిప్రాయపడ్డారు. 8లో ▸



ఐపీఎల్ బెట్టింగ్ ముఠా అరెస్టు

ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లకు సంబంధించి బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ముఠాను షాద్‌నగర్‌లో ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకొన్నారు. 8లో ▸

నేడు టైమ్ స్కాలర్‌షిప్ పరీక్ష

సాక్షి, సిటీబ్యూరో: ట్రంఫాంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్ (టీఐఎమ్ఈ) ఆధ్వర్యంలో క్యాట్ (సీఏటీ) పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు స్కాలర్‌షిప్ కోసం టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఒక గంట కాల వ్యవధి కలిగిన ఈ ఆన్‌లైన్ పరీక్ష ఉదయం 10 గంటలకు, సా.6గంటలకు 2 భాగాలుగా జరుగుందని వివరించారు. పేర్ల నమోదు కోసం సంప్రదించాల్సిన వెబ్‌సైట్ www. time4education.com



న్యూస్‌రీల్

అన్నోజిగూడలో గణాంక శాఖ అధికారుల సర్వే



కందుకూరు: జాతీయ గణాంక, పథకాల అమలు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ గణాంక శాఖ ప్రాంతీయ కార్యాలయం హైదరాబాద్‌కు చెందిన అధికారుల బృందం శనివారం మండల పరిధిలోని అన్నోజిగూడలో పర్యటించింది. గణాంక శాఖ అధికారులు కొమ్మెర సతీష్‌కుమార్, కొత్త పృథ్వీరెడ్డి తదితరులు సర్వే చేపట్టారు. గృహ నిత్యావసరాల వినియోగం, ఖర్చుల తీరుపై గ్రామ పరిధిలోని కుటుంబాల్లో సర్వే నిర్వహించారు. విద్యార్హతలు, ఖర్చు, జీవన శైలి, వసతి తదితర సమాచారాన్ని సేకరించారు. దేశ సుస్థిర అభివృద్ధిలో భాగంగా నిర్వహించే ఇలాంటి సర్వేలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్‌ఎస్‌ఓకు ఇచ్చిన సమాచారం పూర్తి గోప్యంగా ఉంచుతామని, కచ్చితమైన సమాచారం ఇచ్చి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కాకి ఇందిర, ఉప సర్పంచ్ స్వరూప, అంగన్‌వాడీ టీచర్ శ్యామల, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

దేశంలో తెలంగాణ మొదటి స్థానం

- జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి



మెదక్‌పల్లిలో సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

తలకొండపల్లి: సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. పేదల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి, చీపునుంతల, సంఘాయిపల్లి, రాంపూర్, తుమ్మలకుంట తండా, మెదక్‌పల్లి, పడకల్, దేవుని పడకల్ గ్రామాల్లో శనివారం ఆమె ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో కలిసి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ముందుగా ఆయా గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణపు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ప్రజలకవసరమైన మౌలిక సదుపాయాలు, వనరులు కల్పించినట్టు చెప్పారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటేశ్, ఎంపీపీ తిర్మణి నిర్మల, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌యాదవ్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ముజిబుర్ రెహ్మాన్, మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ నర్సింహ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ పాల్గొన్నారు.

హైలైఫ్ జ్యువెల్స్ ఎగ్జిబిషన్ బ్రోచర్ ఆవిష్కరణ



మాదాపూర్: మాదాపూర్‌లోని నోవోటెల్‌లో శనివారం హైలైఫ్ జ్యువెల్స్ ఎగ్జిబిషన్ బ్రోచర్‌ను నిహారిక కొణిదెల పలువురు మోడల్స్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 14, 15, 16వ తేదీలలో నిర్వహించనున్న హైలైఫ్ జ్యువెల్ ఎగ్జిబిషన్‌లో వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్‌లు టాప్ జ్యులరీ డిజైనర్స్ తయారు చేసిన ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు.



గ్రేటర్ బీజేపీలో మోదీ జోష్

నగరానికి వచ్చిన ప్రధాని మోదీ

- సీఎం కేసీఆర్ కుటుంబమే లక్ష్యంగా.. బీఆర్‌ఎస్‌పై పరోక్ష విమర్శనాస్త్రాలు
- కమలం శ్రేణుల్లో నూతనోత్సాహం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ బీజేపీలో ప్రధాని నరేంద్ర మోదీ జోష్ నింపారు. ప్రత్యక్షంగా ఎవరి పేర్లు ప్రస్తావించకుండా పరోక్షంగా అధికార బీఆర్‌ఎస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. సీఎం కేసీఆర్ కుటుంబం టార్గెట్‌గా చేసిన ప్రసంగం పార్టీ శ్రేణులకు ఓ టానిక్‌లా ఉపయోగపడింది. అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై.. పరేడ్ గ్రౌండ్‌ను మోదీ నామస్మరణతో హోరెత్తించారు.

గందరగోళం.. వాగ్వాదం..

సభకు హాజరయ్యేందుకు బీజేపీ నేతలు పాసులతో రాగా.. అప్పటికే వీఐపీ బ్యారక్ పార్టీ ప్రముఖులతో పూర్తిగా నిండిపోయాయి. ఒకే సమయంలో పెద్ద సంఖ్యలో తరలి రావడం, పాసులతో వచ్చిన వారిని కూడా పోలీసులు పూర్తిగా చెక్ చేసి లోనికి అనుమతించడంతో గేటు వద్ద స్వల్ప తొక్కిసలాట చోటు చేసుకుంది. లోనికి బలవంతంగా తోసుకుని వచ్చేందుకు యత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట, వాగ్వాదం చోటు చేసుకుంది. పలువురు కార్యకర్తలు ముఖాలకు మోదీ మాస్కులు ధరించగా, మరికొంత మంది మోదీ దేవుడు అంటూ ప్లకార్డులు ప్రదర్శించడం గమనార్హం.



వందే భారత్‌లో విద్యార్థినుల ఆనందం

5.30 గంటలు ట్రాఫిక్ నరకం



సికింద్రాబాద్ పరిసరాల్లో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాహనదారులకు చుక్కలు కనిపించాయి. పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నగరంలో పర్యటించారు. బేగంపేట, సికింద్రాబాద్ మార్గాల్లో నగర పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆయా ప్రాంతాల చుట్టూ 2 కి.మీ. పరిధిలో రహదారులు, ఫ్లై ఓవర్లను నిర్బంధించి, ట్రాఫిక్‌ను మళ్లించారు. ఉదయం 9 నుంచి 2 గంటల వరకు కిలోమీటర్ల మేర రోడ్లపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



మోదీకి శ్రీవారి ప్రతిమను అందజేస్తున్న కిషన్‌రెడ్డి

మరో 41 కిలో మీటర్లు..

నగరంలో పెరిగిన ఎంఎంటీఎస్ కనెక్టివిటీ

- కొత్తగా 13 ఎంఎంటీఎస్ రైళ్లను ప్రారంభించిన ప్రధాని
- సికింద్రాబాద్- మేడ్చల్, ఫలక్‌నుమా- ఉందానగర్‌ల మధ్య విస్తరణ

సాక్షి, సిటీబ్యూరో: ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఎంఎంటీఎస్ రెండో దశ రైళ్లు ఎట్టకేలకు పట్టాలెక్కాయి. ప్రధాని మోదీ శనివారం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్ నుంచి 13 ఎంఎంటీఎస్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. రెండో దశలో భాగంగా కొత్తగా విస్తరించిన మేడ్చల్-బొల్లారం- సికింద్రాబాద్, ఫలక్‌నుమా- ఉందానగర్ రూట్‌లలో ఈ రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. ఇప్పటి వరకు సుమారు 44 కిలోమీటర్ల వరకు నగరంలో ఎంఎంటీఎస్ కనెక్టివిటీ ఉండగా కొత్తగా అందుబాటులోకి వచ్చిన మార్గాలతో మరో 41 కిలోమీటర్ల వరకు ఎంఎంటీఎస్ సేవలు విస్తరించాయి. సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వరకు 28 కి.మీ మార్గంలో ఎంఎంటీఎస్‌లు పరుగులు తీస్తాయి. ఫలక్‌నుమా నుంచి ఉందానగర్ వరకు 13 కి.మీ వరకు ఎంఎంటీఎస్ రైళ్లు కొత్తగా అందుబాటులోకి వచ్చాయి. ఎంఎంటీఎస్ రెండో దశలో భాగంగా గతంలోనే నిర్మించిన లింగంపల్లి- రామచంద్రాపురం వరకు మరో 6 కి.మీ రూట్‌లో గతేడాది నుంచే రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఎంఎంటీఎస్ రెండో దశలో భాగంగా సికింద్రాబాద్- ఘట్కేసర్, మౌలాలీ-సనత్‌నగర్ మార్గాలు వినియోగంలోకి రావాల్సి ఉంది. ఉందానగర్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు కొత్తగా 6 కి.మీ నిర్మించాలని ప్రతిపాదించినా వాయిదా పడింది. మరోవైపు సికింద్రాబాద్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ రెండో దశను విస్తరించాలనే ప్రతిపాదన పెండింగ్‌లోనే ఉంది.

అన్ని వర్గాలకు ప్రయోజనం..

కొత్తగా ప్రారంభించిన ఎంఎంటీఎస్ రైళ్లతో మేడ్చల్, బొల్లారం, మల్కాజిగిరి, సఫిల్‌గూడ, నేరేడ్‌మెట్, తదితర ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ వర్గాలకు చెందిన ప్రయాణికులకు ఎంతో ఊరట లభించనుంది. మేడ్చల్ నుంచి సికింద్రాబాద్ వరకు కేవలం అరగంట వ్యవధిలో చేరుకుంటారు. శంషాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన కూరగాయలు, పాలు, తదితర వస్తువులను విక్రయించే చిరు వ్యాపారులు ఉందానగర్ నుంచి ఫలక్‌నుమా మీదుగా సికింద్రాబాద్ వరకు రాకపోకలు సాగించేందుకు అవకాశం ఏర్పడింది.



పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభలో కళాకారుల ఆటాపాట



పోలీసు వాహనాన్ని చుట్టుముట్టిన గ్రామస్తులు

ఆ పరిశ్రమను మూసివేయండి

- స్పాంజ్ ఐరన్ పరిశ్రమ ఎదుట గ్రామస్తుల ఆందోళన
- యాజమాన్యం వైఖరిపై నిరసన
- ఉద్రిక్తంగా మారిన పరిస్థితులు
- సర్దిచెప్పిన పోలీసులు

నందిగామ: వీర్లపల్లి శివారులోని స్పాంజ్ ఐరన్ పరిశ్రమ వద్ద మూడు రోజులుగా కొనసాగుతున్న ఆందోళనలు శనివారం తీవ్ర రూపం దాల్చాయి. వందలాది మంది గ్రామస్తులు పరిశ్రమ గేటు ఎదుట బైఠాయించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విచక్షణా రహితంగా కాలుష్యాన్ని వదులుతున్నారని, దీంతో తాము అనారోగ్యాలకు గురవుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమతో చర్చలు జరిపిన తర్వాతే పరిశ్రమలో ఉత్పత్తులు ప్రారంభిస్తామని చెప్పిన యాజమాన్యం మాట తప్పి యథావిధిగా పనులు ప్రారంభించటంతో గ్రామస్తులు పరిశ్రమలోకి దూసుకెళ్లి కార్మికులను బయటకు పంపి బంద్ చేయించారు. అనంతరం పరిశ్రమ యజమానులను నిలదీశారు. పరిశ్రమ యజమానులు గ్రామస్తుల నుంచి తప్పించుకొని వెళ్లేందుకు ప్రయత్నించగా వారి వెంటపడిన మహిళలు గేటు వద్దకు తీసుకొచ్చి కాలుష్యం గురించి ప్రశ్నించారు. ఇప్పటికే తమ గ్రామంలో నల్లటి బూడిద కమ్ముకొని పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి చేయిదాటిపోయేలా మారడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఇన్‌స్పెక్టర్ రామయ్య ఆధ్వర్యంలో సిబ్బంది పరిశ్రమ వద్దకు చేరుకొని గ్రామస్తులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. అయినా వారు వినకపోవడంతో అతి కష్టం మీద యజమానులను పోలీస్ వాహనం ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో గ్రామస్తులు పోలీసుల వాహనాన్ని చుట్టుముట్టారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ఇన్‌స్పెక్టర్ రామయ్య చాకచక్యంతో వారిని అక్కడి నుంచి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా మూడు నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చినట్లు తెలిసింది.

పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రత

రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్

మీర్‌పేట: పోలీసు శాఖ ఎస్‌ఐ తుదిరాత పరీక్ష మీర్‌పేటలోని టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో శనివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్షా కేంద్రాన్ని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ సందర్శించి బందోబస్తు, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌ఐతో పాటు పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని, సెల్‌ఫోన్‌లను పరీక్షా కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించడం లేదని తెలిపారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే అనుమతిస్తున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లెలగూడ ప్రభుత్వ పాఠశాలలోని 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కమిషనర్ వెంట ఎల్‌బీ నగర్ డీసీపీ సాయిశ్రీ, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డి, మీర్‌పేట సీఐ మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



టీకేఆర్ కళాశాలలో ఎస్‌ఐ తుది రాత పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన రాచకొండ సీపీ

అంచనాలకు మించి..

రిజిస్ట్రేషన్ శాఖకు దండిగా కాసులు

- గ్రేటర్ నుంచి రూ.7,691 కోట్ల రాబడి
- 4.72 లక్షల దస్తావేజుల నమోదు
- శివార్లలోనే అత్యధిక స్థిరాస్తి లావాదేవీలు

గ్రేటర్‌లో రిజిస్ట్రేషన్ శాఖకు రాబడి ఇలా ..

జిల్లా	దస్తావేజులు	ఆదాయం (రూ.కోట్లలో)
రంగారెడ్డి	2.47 లక్షలు	రూ.3,861
మేడ్చల్ మల్కాజిగిరి	1.62 లక్షలు	రూ.2,400
హైదరాబాద్	63 వేలు	రూ.1,430



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో రిజిస్ట్రేషన్ శాఖకు కాసుల పంట పండింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.7,691 కోట్ల ఆదాయం సమకూరింది. మొత్తం మీద 4.72 లక్షల స్థిరాస్తి దస్తావే జులు నమోదయ్యాయి. లావాదేవీలు అంచనాలకు మించి జరుగుతుండటంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం ఎగబాకుతోంది. మొదటి ఆరు నెలల పాటు స్థిరాస్తి రంగం మందకొడిగా సాగినా ఆ తర్వాత పుంజుకుంది. రాష్ట్రం మొత్తంమీద రూ.14,286 కోట్ల ఆదాయం సమకూరితే అందులో సగానికి పైగా గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల నుంచి రావడం విశేషం. రంగారెడ్డి అగ్రస్థానంలో జిల్లా ఉండగా రెండో స్థానంలో మల్కాజిగిరి-మేడ్చల్, మూడో స్థానంలో హైదరాబాద్ నిలిచాయి. శివారు ప్రాంతాల్లోనే స్థిరాస్తి లావాదేవీలు అత్యధికంగా జరిగినట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

శివారుపైనే ఆసక్తి

నగర శివారుపైనే కొనుగోలుదారులు ఆసక్తి కనబర్చుతుండటంతో గృహ, వాణిజ్య నిర్మాణాలు పోటీ పడుతున్నాయి. శివారు చుట్టూ 20 నుంచి 30 కిలో మీటర్ల వరకు ప్లాట్స్, ఫ్లాట్స్‌కు డిమాండ్ భారీగా పెరిగింది. ఇండిపెండెంట్ గృహాలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలపై కొనుగోలుదారులు ఆసక్తి కనబర్చుతున్నారు. నాగోలు, బండ్లగూడ, హస్తినాపురం, బీఎన్ రెడ్డినగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అల్వాల్, ఎల్బీ నగర్, తదితర ప్రాంతాల్లో ఇండిపెండెంట్ గృహాలకు, శేరిలింగంపల్లి, చందానగర్, యూసుఫ్‌గూడ, రామచంద్రాపురంలో అపార్ట్‌మెంట్లకు డిమాండ్ పెరిగింది. మెట్రో రవాణా అందుబాటులోకి రావడంతో కొనుగోలుదారుల దృష్టి ఉప్పల్ మార్గం వైపు పడింది. వరంగల్ రహదారి మార్గంలో ఘట్‌కేసర్ వరకు వ్యక్తిగత ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు కొనుగోళ్లు పెరిగాయి. పశ్చిమంలోని ఐటీ కేంద్రానికి సైతం గంటలోపే చేరుకునే సౌలభ్యం ఉండడంతో ఉద్యోగులు ఇటువైపు ఉండేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఆఫీస్ స్థలాలకు డిమాండ్

ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీలకు అనువైన ప్రదేశంగా హైదరాబాద్‌కు గుర్తింపు రావడంతో 'ఆఫీస్' స్థలాలకు డిమాండ్ భారీగా పెరిగింది. నగర శివారులోని ఆదిబట్లలో టాటా ఏరోస్పేస్, టీసీఎస్ ఐటీ పరిశ్రమ నిర్మాణం, ముచ్చర్లలో ఫార్మాసిటీల నిర్మాణం స్థిరాస్తి రంగానికి మరింత ఊపునిచ్చాయి. మరోవైపు నగరం చుట్టూ కొత్తకొత్త టౌన్‌షిప్‌లు ఏర్పాటుతో పెద్ద ఎత్తున వాణిజ్య నిర్మాణాలకు కూడా డిమాండ్ ఏర్పడింది. దీంతో స్థిరాస్తి వ్యాపారులు భూయజమానులతో ఒప్పందం చేసుకుని స్థలాలను అభివృద్ధి చేస్తున్నారు. భూ యజమానుల వాటాకు కొంత వాణిజ్య స్థలాన్ని ఇవ్వడంతో పరిస్థితులు మరింత సానుకూలంగా మారాయి.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం తగదు

- పదో తరగతి పేపర్ లీకేజీ వ్యవహారంలో బండి సంజయ్‌ది కీలక పాత్ర
- పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలి
- షాద్‌నగర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సబితారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

షాద్‌నగర్: విద్యార్థుల జీవితాలతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చెలగాటం ఆడుతున్నారని మంత్రి సబితారెడ్డి విమర్శించారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ నేతల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అధ్యక్షతన పట్టణంలోని ఎల్ఎన్ గార్డెన్‌లో జరిగింది. సమావేశానికి మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్సీ రమణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పదో తరగతి పేపర్ లీకేజీ వ్యవహారంలో బండి సంజయ్ కీలక పాత్ర పోషించారని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఐటీఐఆర్ ప్రాజెక్టును ఎందుకు రద్దు చేసిందని ప్రశ్నించారు. ప్రధాని మోదీకి తెలంగాణ ప్రజలపై చిత్తశుద్ధి, ప్రేమ ఉంటే వెంటనే ఐటీఐఆర్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది ఉద్యోగాలకు అవకాశం ఉన్న ఫార్మాసిటీకి వెంటనే అనుమతులు ఇవ్వాలని, పాలమూరు ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాలకు మెడికల్ కళాశాలలు మంజూరు చేసి తెలంగాణకు ఎందుకు చేయలేదని నిలదీశారు. కేంద్రం తెలంగాణకు చేస్తున్న అన్యాయాలను ప్రశ్నిస్తుంటే బీజేపీ నేతలు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితలపై లేనిపోని విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తుంటే కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నిత్యావసర సరుకులతో పాటు జీఎస్టీ పేరుతో వస్తువుల ధరలను పెంచి నడ్డివిరుస్తోందని ఆమె ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. వాటిని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని, బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలు, విమర్శలను సమర్థంగా తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

భవిష్యత్తులో అందుబాటులోకి ఆన్‌లైన్ విద్య



మాట్లాడుతున్న డా. మంజూర్ హుస్సేన్

జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ డా.మంజూర్ హుస్సేన్

ఇబ్రహీంపట్నం: సంప్రదాయ విద్య దూరమై సమీప భవిష్యత్తులో ఆన్‌లైన్ విద్య అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ డా. మంజూర్ హుస్సేన్, నానో టెక్నాలజీ ప్రొఫెసర్ డా. వెంకటేశ్వరరావు అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యాసంస్థల 22వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ.. పాఠ్యాంశాల్లో భాగంగా విద్యార్థులు జేఎన్‌టీయూహెచ్ అందించే డ్యూయల్, మైనర్ డిగ్రీ కోర్సులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గురునానక్ విద్యాసంస్థల ప్రతినిధులు జీఎస్ కోహ్లి, హెచ్ఎస్ సైనీ, డైరెక్టర్ వెంకటరావు, జాయింట్ డైరెక్టర్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి రంగారెడ్డి

శనివారం, 8, ఏప్రిల్, 2023



చట్టాలపై అవగాహన అవసరం

న్యాయశాస్త్రం అభ్యసించే విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రగోష్ అన్నారు. 10లో▸



హామీలు అమలు చేయరేం

ప్రజా సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి అలుగడ్డ ప్రవీణ్‌యాదవ్ విమర్శించారు. 10లో▸

రేపు ట్రాఫిక్ మళ్లింపు

ఉప్పల్: ఉప్పల్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆదివారం ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరంగల్ నుంచి సికింద్రాబాద్, సికింద్రాబాద్ నుంచి వరంగల్‌కు వయా ఉప్పల్ మీదుగా వెళ్లే వాహనాలను చెంగిచర్ల ఎక్స్‌రోడ్డు వద్ద దారి మళ్లిస్తారు. సికింద్రాబాద్ నుంచి ఎల్‌బీ నగర్, ఎల్‌బీనగర్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే వాహనాలను దిల్‌సుఖ్‌నగర్ వైపు మళ్లిస్తారు.



అ'క్రమబద్ధీకరణ'!

- అడ్డగోలుగా ప్రభుత్వ భూముల కబ్జాలు.. నిర్మాణాలు
- వరంగా మారిన 58,59 జీఓల దరఖాస్తు గడువు పెంపు
- అక్రమార్కులకు వెన్నుదన్నుగా అధికారులు?
- పాత పంచాయతీల పేరుతో ధ్రువీకరణ పత్రాల జారీ
- పేదల ముసుగులో సర్కారు భూములను కొల్లగొడుతున్న పెద్దలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ భూముల్లో వెలసిన పేదల ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం జారీ చేసిన జీఓలు అక్రమార్కులకు వరంగా మారాయి. ప్రభుత్వ, అర్బన్ సీలింగ్, అసైన్డ్, భూదాన్, వక్ఫ్ భూములను ఆక్రమించి రాత్రికి రాత్రే వాటిలో తాత్కాలిక నిర్మాణాలు చేపట్టి, వాటికి పాత పంచాయతీల నుంచి ఇంటి నంబర్లు, ఆస్తి పన్ను చెల్లింపు రసీదులు సృష్టించి క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేస్తున్నారు. అక్రమార్కులకు స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలు ఉండటం, క్రమబద్ధీకరణ పేరుతో ప్రభుత్వమే భూ ఆక్రమణలను ప్రోత్సహిస్తుండటంతో ప్రభుత్వ రెవెన్యూ, మున్సిపల్ యంత్రాంగాలు ఏమీ చేయలేక నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నాయి. ఫలితంగా రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. భవిష్యత్తు అవసరాలకు భూములు లేకుండా పోతున్నాయి.

కాపాడలేకే..క్రమబద్ధీకరణకు మొగ్గు

నగరానికి ఆనుకుని ఉండటంతోపాటు అంతర్జాతీయ విమానాశ్రయం సహా అవుటర్ రింగ్‌రోడ్డు జిల్లాలోనే ఉన్నాయి. జాతీయ, అంతర్జాతీయ ఐటీ అనుబంధ సంస్థలు జిల్లా కేంద్రంగా పెట్టుబడులు పెడుతుండటం, రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. మణికొండ, శేరిలింగంపల్లి, నార్సింగి, రాజేంద్రనగర్, శంషాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ సహా హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట, తుర్కయంజాల్, తుక్కుగూడ, మీర్‌పేట్, బడంగ్‌పేట, జల్‌పల్లి, తదితర ప్రాంతాలు నగరంలో కలిసిపోయాయి. పదేళ్ల క్రితం వరకు పంచాయతీలుగా ఉన్న ఆయా ప్రాంతాలు మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. ఆయా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు ఉన్నాయి. కొంత భూమిని పేదలు ఆక్రమించుకుని ఇప్పటికే ఇళ్లు నిర్మించుకోగా.. మరికొంత స్థానిక ప్రజాప్రతినిధులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. పట్టణ కేంద్రాల్లోని ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించలేని పరిస్థితి నెలకొంది. సర్కారు భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఆయా భూములను క్రమబద్ధీకరించడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందొచ్చని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు 2022 ఆగస్టులో జీఓ నంబర్ 58, 59లను తెచ్చింది. 2014 జూన్ 2 కంటే ముందు ఉన్న నిర్మాణాలు సహా ఆక్రమణలో ఉన్న స్థలాలను ఆయా లబ్ధిదారుల పేరున క్రమబద్ధీకరించనున్నట్లు ప్రకటించింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 31,830 దరఖాస్తులు అందాయి.

పాత పంచాయతీల నుంచి..

జీఓ నంబర్ 58 కింద 18,601 దరఖాస్తులు రాగా, వీటిలో 2,696 నిర్మాణాలు మాత్రమే క్రమబద్ధీకరణకు అర్హత పొందాయి. ఇక జీఓ నంబర్ 59 కింద 13,229 దరఖాస్తులు రాగా, 2,750 మాత్రమే క్రమబద్ధీకరణకు అనుమతి పొందాయి. మెజార్టీ దరఖాస్తులు తిరస్కరణకు గురికావడంతో ప్రభుత్వం తాజాగా మరో అవకాశం కల్పించింది. కటాఫ్ డేట్ 2014 జూన్ నుంచి 2020 జూన్‌కు పెంచింది. కొత్త దరఖాస్తులకు ఏప్రిల్ 30 వరకు అవకాశం కల్పించింది. ఈ వెసులుబాటును కొంతమంది కబ్జాదారులు అవకాశంగా తీసుకుంటున్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలకు నోటరీ పత్రాలు సృష్టించి రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపడుతున్నారు. పాత పంచాయతీల నుంచి 2020 ముందు తేదీలతో ఇంటి నంబర్లు పొంది, ఆస్తిపన్ను సైతం చెల్లించినట్లు రసీదులు పొందుతున్నారు. వీటి ఆధారంగా క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేస్తున్నారు. వీరికి ఆయా మండలాల్లోని రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారుల అండదండలు ఉండడం గమనార్హం. తాజా వెసులుబాటుతో ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి కొత్తగా వేలాది దరఖాస్తులు అందుతుండటం విశేషం.

ఆ అధికారులకు కాసుల వర్షం

ఇళ్లు, ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణతో ప్రభుత్వానికి రూ.135 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని అంచనా. మరోవైపు క్షేత్రస్థాయిలోని రెవెన్యూ, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్, విద్యుత్, జలమండలి అధికారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. రెవెన్యూలోని కొంతమంది అధికారులు అడిగినంత ఇస్తే చాలు పాత తేదీలతో ప్రొసీడింగ్స్ జారీ చేస్తుండగా, సీపీడీసీపీఎల్ లైన్‌మన్లు విద్యుత్ మీటర్లు జారీ చేయిస్తున్నారు. ఒక్కో మీటర్‌కు రూ.25వేల దాకా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక కొత్త ఇంటి నంబర్ల జారీ కోసం టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రాంతాన్ని బట్టి ఒక్కో ఆక్రమణదారుడి నుంచి రూ.50 వేల నుంచి రూ.లక్ష దాకా డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. బడంగ్‌పేట, తుర్కయంజాల్, పెద్ద అంబర్‌పేట, శంషాబాద్, మణికొండ, నార్సింగి, శంకర్‌పల్లి మున్సిపాలిటీల్లో ఈ వసూళ్ల దందా ఎక్కువగా సాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ముగిసిన బాలాజీ బ్రహ్మోత్సవాలు

- చివరి రోజు ప్రత్యేక పూజలు
- చక్రస్నానంతో ముగింపు
- భారీగా తరలివచ్చిన భక్తులు



చక్రస్వామికి సహస్రదారాభిషేకం చేస్తున్న అర్చకులు

మొయినాబాద్: ఎనిమిది రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగిన బాలాజీ బ్రహ్మోత్సవాలు శుక్రవారం చక్రస్నానంతో ముగిశాయి. స్వామి వారికి సర్వసైన్యాధిపతి అయిన చక్రస్వామి ఆధ్వర్యంలో చివరిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం దేవాలయంలోని హోమ గుండాల గదిలో పూర్ణాహుతి చేపట్టారు. పూర్ణాహుతి ప్రసాదాన్ని అష్టదిక్పాలకులకు నైవేద్యంగా పెట్టి బలిహరణం చేశారు. అంతకు ముందు స్వామివారిని శ్రీదేవి, భూదేవి సమేతంగా అద్దాలపల్లకిలో ఆసీనులను చేసి అలంకరించారు. అనంతరం చక్రస్వామి, నవపాలికలు, స్వామివారిని పల్లకిలో దేవాలయం చుట్టూ ఊరేగించారు. శివాలయం పక్కనే ఉన్న మండపంలో నవకలశ స్థాపనం, పాలికల పూజతో దేవ్వళందరినీ ఆవాహనం చేసి సుగంధద్రవ్యాలతో నవకలశ అభిషేకం చేశారు. తరువాత చక్రస్వామిని ఆలయ సమీపంలో ఉన్న గండిపేట చెరువులోకి తీసుకెళ్లి చక్రస్నానం చేయించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ చక్రతీర్థాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాకృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, కృష్ణమాచార్యులు, రామాచార్యలు, నరసింహన్, బాలాజీ, కిట్టు, మురళి, కన్నయ్య, సురేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తరలివచ్చిన భక్తజనం

బ్రహ్మోత్సవాల చివరిరోజు భక్తులు భారీగా తరలివచ్చారు. పరిసర ప్రాంతాలతోపాటు నగరం నుంచి పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. చక్రతీర్థం సందర్భంగా మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధికంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయ అర్చకులు గరుడ పటాన్ని అవరోహణం చేసి బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ప్రకటించారు.



గండిపేట చెరువులో చక్రస్వామికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

న్యూస్‌రీల్

జాతీయ పురస్కారానికి కాన్హా పంచాయతీ



నందిగామ: మండల పరిధిలోని కాన్హా గ్రామ పంచాయతీ జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికైనట్లు ఎంపీడీఓ బాల్‌రెడి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణం, ప్రకృతి విభాగంలో తెలంగాణ నుంచి కార్బన్ న్యూట్రల్ విశేష్ పంచాయతీ పురస్కారానికి కాన్హా పంచాయతీని కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసినట్లు చెప్పారు. దేశ వ్యాప్తంగా మూడు పంచాయతీలు ఈ పురస్కారానికి ఎంపిక కాగా మన రాష్ట్రం నుంచి కాన్హా పంచాయతీ ఎంపిక కావడంపై గ్రామ సర్పంచ్ సరిత, ఉప సర్పంచ్ మధుసూదన్ హర్షం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్సులో మంటలు

డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ముప్పు



బస్సులో వ్యాపించిన మంటలు

సనత్‌నగర్: శంషాబాద్ నుంచి జేబీఎస్‌కు ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సకాలంలో గుర్తించిన బస్సు డ్రైవర్ వెంటనే ప్రయాణికులను అప్రమత్తం చేసి కిందికి దించేయడంతో ప్రాణనష్టం తప్పింది. బస్సులోని బ్యాటరీ కూల్ సర్క్యూట్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా దట్టమైన పొగలతో మంటలు వ్యాపించాయి. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బేగంపేట విమానాశ్రయం వద్ద జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు శంషాబాద్ విమానాశ్రయం నుంచి గ్రీన్ ల్యాండ్స్ మీదుగా జేబీఎస్‌కు వెళ్తుంది. బస్సు బేగంపేట విమానాశ్రయం ముందుకు రాగానే పైభాగం నుంచి పొగలు రావడాన్ని డ్రైవర్ వెంకట్‌రెడ్డి గమనించారు. వెంటనే బస్సును పక్కనే ఉన్న మనోహర్ హోటల్ వద్ద నిలిపివేసి ప్రయాణికులను అప్రమత్తం చేశాడు. ఆ సమయంలో బస్సులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందిని కిందికి దించేశారు. వెంటనే ఆర్టీసీ కంటోన్మెంట్ డిపోకు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సికింద్రాబాద్ అగ్నిమాపక కేంద్రం నుంచి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ఘటనతో కొద్దిసేపు బేగంపేట మార్గంలో ట్రాఫిక్‌జాం ఏర్పడింది.

ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వద్దు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి

జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి

షాద్‌నగర్: ఆరోగ్యమే మహాభాగ్యమని జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం చించోడ్, బూర్గుల, షాద్‌నగర్ పీపీ యూనిట్ ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ప్రభుత్వ ఆస్పత్రి నుంచి చౌరస్తా వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నరహరి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. పరిశుభ్రమైన నీటిని తాగాలని, అప్పుడే వండిన పదార్థాలను తినాలని, పండ్లు, కూరగాయలతో పాటు పోషక విలువలున్న తాజా ఆహార పదార్థాలను తినాలన్నారు. నిత్యం కొంత సమయాన్ని వ్యాయామం చేసేందుకు కేటాయించాలన్నారు. ప్రభుత్వం నిరుపేదల ఆరోగ్య సంరక్షణ కోసం అనేక చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలతో పాటు కేసీఆర్ న్యూట్రిషియన్, ఎన్‌సీడీ కిట్‌లను అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు చంద్రకళ, శ్రీరమ, చంద్రకళ, ఫార్మసిస్టు ఉదయ్‌కుమార్, రమేష్, రవికుమార్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పరీక్షలు రాయమన్నారని విద్యార్థి బలవన్మరణం

నాదర్‌గుల్‌లో విషాదం

ఇబ్రహీంపట్నం రూరల్: పరీక్షలు రాయమని తల్లిదండ్రులు మందలించడంతో విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన విషాదకర సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బాలాపూర్ మండలం నాదర్‌గుల్ గ్రామానికి చెందిన బంగారి పెంటయ్య కుమారుడు బంగారి రాజేష్ (15) నాదర్‌గుల్ ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. కొద్ది రోజులుగా బడికి వెళ్లకుండా, పరీక్షలు రాయకుండా అల్లరచిల్లరగా తిరుగుతున్నాడు. దీంతో పరీక్షలు రాయాలని తల్లిదండ్రులు మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన రాజేష్ ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇరుగుపొరుగువారు చూసి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నిధులు లేక.. పనులు సాగక..

- తడిసి మోపెడవుతున్న ఖర్చులు
- సర్పంచ్‌లపై పెరిగిన ఆర్థికభారం
- పంచాయతీల్లో కుంటుపడుతున్న అభివృద్ధి



పాఠశాల భవనంలో కొనసాగుతున్న షాబాద్ మండలం నాగర్‌గూడ పంచాయతీ కార్యాలయం

షాబాద్: ఐదువందల లోపు జనాభా కలిగిన తండాలు, గూడేలను పంచాయతీలుగా మార్చిన ప్రభుత్వం వాటి నిర్వహణకు మాత్రం సరైన నిధులు మంజూరు చేయడం లేదు. చిన్న పంచాయతీలకు ఏటా రూ. 5లక్షలు విడుదల చేస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదు. దీంతో ప్రతీ నెల ఎస్ఎఫ్‌సీ, సీఎఫ్‌సీల నుంచి వచ్చే నిధులు ఏమాత్రం సరిపోక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు అప్పుల చెల్లింపునకే సరిపోతున్నాయి. ఉపాధిహామీలో వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డుల నిర్మాణం చేపట్టినా నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. జిల్లాలో 558 పంచాయతీలు ఉన్నాయి. 500 జనాభాకు తక్కువగా ఉన్న జీపీలు 29, వెయ్యి జనాభాకు తక్కువగా ఉన్నవి 80, ఏకగ్రీవం జీపీలు 22 వరకు ఉన్నాయి. ప్రతి నెలా ట్రాక్టర్ ఈఎంఐ రూ.15వేలు, వీధి దీపాలు, విద్యుత్ బిల్లులకు రూ.9వేల నుంచి రూ.10 వేల వరకు, ట్రాక్టర్ డీజిల్‌కు రూ.8వేల నుంచి రూ.9 వేలు, స్టేషనరీ, బ్లీచింగ్ పౌడర్, సున్నం, ఇతరత్రా ఖర్చులకు రూ. 10వేలు మొత్తంగా రూ.60వేలకు పైగా వ్యయం అవుతోంది. చిన్న పంచాయతీలకు రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు వస్తాయి. ఈ లెక్కన ప్రతీ నెల రూ.15వేల నుంచి రూ.17 వేలు అదనంగా భరించాల్సి వస్తోంది. అప్పులు తెచ్చి పనులు చేయించినా బిల్లులు రాకపోవడంతో ఆర్థికభారం తప్పడం లేదని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పది నెలలుగా నిధులకు బ్రేక్

పంచాయతీలకు కేంద్రం, రాష్ట్రం నుంచి అందాల్సిన నిధులకు పది నెలలుగా బ్రేక్ పడింది. పలు కారణాలతో అభివృద్ధి నిధులు రాకపోవడంతో సర్పంచ్‌లపై ఆర్థిక భారం మరింత పెరిగింది. ఇటీవల కేంద్రం నేరుగా పంచాయతీ ఖాతాలో ప్రయోగాత్మకంగా కొన్ని నిధులు వేసినట్లు అధికారులు చెబుతున్నారు. కొంత మొత్తం నిధులు తమకు ఇప్పటి వరకు వచ్చిన దాఖలాలు లేవని సర్పంచ్‌లు వాపోతున్నారు.

కరువైన ప్రోత్సాహం

ఎన్నికల సమయంలో పాలకవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ప్రత్యేక ప్రోత్సాహకం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో చాలా గ్రామాల్లో తమ పంచాయతీల అభ్యున్నతికి నిధులు వినియోగించుకోవచ్చని ఏకగ్రీవం చేసుకున్నారు. వాటిలో చిన్న పంచాయతీలే అధికంగా ఉన్నాయి. ఏళ్లుగా ఎదురుచూసినా ప్రోత్సాహక నిధులు రాలేదు.

అద్దె భవనాలు..అరకొర వసతులు

జిల్లాలో సుమారు 124 పంచాయతీలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కొన్నింటిని ప్రభుత్వ పాఠశాలల్లో, మరికొన్నింటిని అద్దె ఇళ్లలో ఏర్పాటు చేసుకొని పాలన సాగిస్తున్నారు. సరైన వసతులు లేక అష్టకష్టాలు పడుతూ నెట్టుకొస్తున్నారు.

ఇబ్బందిగా ఉంది



పంచాయతీలకు పది నెలలుగా కేంద్రం, నాలుగు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. పంచాయతీల్లో నిధులు లేక వేతనాలు ఇవ్వడం ఇబ్బందికరంగా మారింది.

– ఈదుల కృష్ణగౌడ్, సర్పంచ్, నాగర్‌గూడ

నిధులు మంజూరు చేయాలి



గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని నమ్మి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహకం అందజేస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా ఏకగ్రీవ పంచాయతీలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి.

– మంగమ్మ, సర్పంచ్, పోలారం

విడతల వారీగా జమ

పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వ నిధులు ఇటీవలే కొంత మొత్తంలో జమయ్యాయి. కేంద్ర, రాష్ట్ర నిధులు విడతల వారీగా జమ అవుతాయి. సర్పంచ్‌లు ఆందోళన చెందొద్దు. చిన్న పంచాయతీల్లో నిధులు సరిపోవడం లేదని సర్పంచ్‌ల ద్వారా మా దృష్టికి వచ్చింది. ఉన్నతాధికారులకు నివేదించాం.

– శ్రీనివాస్‌రెడ్డి, డీపీఓ







భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

నగరంలో గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. అన్ని ప్రధాన చర్చిల్లో యేసు శిలువ ధ్యాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. సర్వమానవాళి పాప పరిహారం కోసం యేసు శిలువను మోశాడని ఈ సందర్భంగా పాస్టర్లు తమ సందేశ కార్యక్రమాల్లో వివరించారు. సికింద్రాబాద్, అబిడ్స్, కూకట్‌పల్లి, మణికొండ, మెహిదీపట్నం తదితర ప్రాంతాల్లోని ప్రధాన చర్చిల్లో ఉదయం నుంచే భక్తుల తాకిడి కనిపించింది.

- సాక్షి, సిటీబ్యూరో



బోయిన్‌పల్లిలోని మౌంట్ కార్మెల్ చర్చిలో..

వృద్ధురాలి పుస్తెలతాడు అపహరణ

అబ్దుల్లాపూర్‌మెట్: ఓ వృద్ధురాలి మెడలోంచి బంగారు పుస్తెలతాడును తస్కరించిన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బండరావిరాల గ్రామానికి చెందిన బాలమ్మ సద్దుపల్లి కూడలిలో మైనింగ్ జోన్ భూనిర్వాసితులు చేస్తున్న ధర్నాలో పాల్గొనేందుకు శుక్రవారం వచ్చింది. అనంతరం సాయంత్రం తిరిగి బండరావిరాలలోని తన ఇంటికి వెళ్తున్న క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చి ఓ గుర్తు తెలియని దుండగుడు ఆమెను ఇంటి వద్ద దింపుతానని నమ్మించి బైకుపై ఎక్కించుకుని కొద్దిదూరం వెళ్లగానే మెడలో ఉన్న 3 తులాల బంగారు పుస్తెల తాడును బలవంతంగా లాక్కుని అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా సంఘటన జరిగిన మార్గాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.



విలపిస్తున్న బాధితురాలు బాలమ్మ

గిరిజనులకు ఇళ్లు, భూములిచ్చింది కాంగ్రెస్సే



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులతో వీర్లపల్లిశంకర్

- పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లిశంకర్
- కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

షాద్‌నగర్‌రూరల్: గిరిజనులకు ఇళ్లు, భూములు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లిశంకర్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వాచ్యాతండా, మేక్యంతండా, కర్ణకుంటతండా, గుట్టెనికితండాల నుంచి వివిధ పార్టీలకు చెందిన సుమారు 300 మంది గిరిజనులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమానికి హాజరైన వీర్లపల్లి శంకర్ మొదట ఆయా తండాలలో కాంగ్రెస్‌పార్టీ జెండాలను ఎగురవేశారు. ఇందిరాగాంధీ చిత్రటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ దివంగత ప్రధానమంత్రి ఇందిరా గాంధీ హయాంలో గిరిజనులకు పక్కా ఇళ్లు, భూములు అందించారని అన్నారు. తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం తండాలలో నెలకొన్న సమస్యలను మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. ఓడిపోతామనే భయంతోనే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తున్నదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2లక్షల రైతు రుణమాఫీ, రైతు భరోసా కింద ఏడాదికి రూ 15వేలు, ఉపాధి హామీ పథకంలో నమోదు చేసుకున్న కూలీలకు రూ 12వేలు, పండించిన పంటకు గిట్టుబాటు ధర అందిస్తామన్నారు. పంటనష్టం జరిగితే నష్టపరిహారం, భూమిలేని రైతులకు రైతుబీమా పథకం వర్తింపజేస్తామని తెలిపారు. రైతుల పాలిట శాపంగా మారిన ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధిచెప్పాలనానరు.అనంతరం పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిచారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, రఘు, కృష్ణారెడ్డి, రాజు, కొమ్ముకృష్ణ, కుమారస్వామిగౌడ్, ముబారక్ అలీఖాన్, చంద్రశేఖర్, రాయికల్‌శ్రీనివాస్, పురుషోత్తంరెడ్డి, రూప్‌సింగ్, శేఖర్, శ్రీనునాయక్, నెహ్రూనాయక్, అంజియాదవ్ పాల్గొన్నారు.



హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో ప్రవీణ్‌యాదవ్, నాయకులు

హామీలు అమలు చేయరేం

- ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు
- పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌యాదవ్

కేశంపేట: ప్రజా సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి అలుగడ్డ ప్రవీణ్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, వేములనర్వ, కేశంపేట, కొత్తపేట, ఎక్లాస్‌ఖాన్‌పేట, సంగెం గ్రామాల్లో శుక్రవారం హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రవీణ్‌యాదవ్ పాల్గొ న్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు పార్టీ కార్యకర్తలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదన్నారు. అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాయన్నారు. కేంద్రలో బీజేపీ ప్రభుత్వం సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వేస్తామని హామీ ఇచ్చి అమలు చేయడంలేదన్నారు. జీఎస్టీ కారణంగా 23 కోట్ల మంది పేదరికంలోకి వెళ్లారని అన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్‌బెడ్రూం ఇళ్లను ఇస్తామని హామీ ఏమైందని మండిపడ్డారు. రుణమాఫీ సైతం అటకెక్కిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబించడం వలన 8 వేల మంది రైతులు మృతి చెందారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500కే సిలిండర్ అందిస్తామని అన్నారు. పెట్రోల్, డిజిల్ ధరలను తగ్గిస్తామని చెప్పారు. నిరుపేదలకు ఇండ్లతో పాటు రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్తకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

- సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రగోష్

నందిగామ: న్యాయ శాస్త్రాన్ని అభ్యసించే విద్యార్థులు చట్టలపై అవగాహన పెంచుకోవాలని సుప్రీంకోర్టు మాజీ న్యాయ మూర్తి జస్టిస్ పినాకి చంద్రగోష్ అన్నారు. మండల పరిధిలోని మొదళ్లగూడ శివారులో సింబాయాసిస్ అంతర్జాతీయ యూనివర్సిటీలోని న్యాయ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మూట్ కోర్టు కాంపిటీషన్ కు పినాకి చంద్రగోష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. దేశంలోని పలు ప్రాంతాలలోని 21 లా కళాశాలలో చదువుతున్న విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచేందుకు ఈ మూట్ కోర్టు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. లా విద్యార్థులు దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చట్టాలపై అవగాహన కల్గిండాలని,దీంతో పాటు పలు న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయ మూర్తి విజయ్‌సేన్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ సంతోష్ ఆగావ్, డిప్యూటీ డైరెక్టర్లు అనేరాధ, అభిలాష్, అక్షిక ప్రధాన్, మూట్ కోర్టు అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తికి జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల ప్రొఫెసర్లు

కారు చోరీ నిందితుల కోసం గాలింపు

పహాడీషరీఫ్: క్యాబ్ డ్రైవర్‌పై దాడి చేసి కారు అపహరించిన ఘటనలో నిందితుల జాడ కోసం పహాడీషరీఫ్ పోలీసులు రెండు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నెల 6న తెల్లవారుజామున ఎల్.బి.నగర్ క్యాబ్ బుక్ చేసుకొని పహాడీషరీఫ్‌లో డ్రైవర్ మీర్జా ఆజం బేగ్‌పై కత్తితో దాడికి పాల్పడి కారును అపహరించిన విషయం తెలిసిందే. ఇద్దరు నిందితులు బేగం బజార్‌లో కారు వదిలి వెళ్లిన నేపథ్యంలో సీసీ కెమెరాల ఆధారంగా చర్యలు చేపట్టారు. నిందితులు కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం.

యాచకురాలి మృతి

పహాడీషరీఫ్: ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పహాడీషరీఫ్ దర్గా మెట్లపై సమీరా బేగం(60) గత కొన్నాళ్లుగా భిక్షాటన చేస్తున్నారు. అనారోగ్యానికి గురైన ఆమె గురువారం రాత్రి మెట్లపైనే మృతి చెందింది. గమనించిన దర్గా పూజారీ మోయినోద్దీన్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

'బలగం' పంచాయితీ

షాద్‌నగర్‌రూరల్: బలగం సినిమా ప్రదర్శనలో రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. దీంతో ఇరు వర్గాల వారు వాగ్వాదానికి దిగారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామీణ వాతావరణం నేపథ్యంలో తెరకెక్కిన బలగం చిత్రాన్ని ప్రేక్షకులు ఎంతగానో ఆదరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రతిఒక్కరూ చూడాలనే ఆలోచనతో బలగం సినిమాను గ్రామాలలో ప్రదర్శిస్తున్నారు. శుక్రవారం రాత్రి అయ్యవారిపల్లిలో బలగం చిత్రాన్ని ప్రదర్శించేందుకు అదే గ్రామానికి చెందిన ఓ నాయకుడు గ్రామ పంచాయతీ వద్ద సిద్ధంచేస్తుండగా మాకు సమాచారం ఇవ్వకుండా గ్రామ పంచాయతీ వద్ద సినిమాను ఎలా ప్రదర్శిస్తారని, అవసరమైతే మీ ఇంటి వద్ద ఏర్పాట్లు చేసుకోవాలని ఒక వర్గం నాయకుడు సూచించారు. దీంతో చిత్ర ప్రదర్శన ఘర్షణ వాతావరణానికి దారి తీసింది. ఇరు వర్గాల వారు వాగ్వాదానికి దిగారు. ఇరు వర్గీయుల పంచాయితీతో చిత్ర ప్రదర్శన కొనసాగలేదు. ప్రజలందరిని ఏకతాటిపైకి తీసుకురావాలని, కుటుంబ బంధాలు, బంధుత్వాలు కలిసి ఉండాలనే ఆలోచనతో తీసిన బలగంచిత్ర ప్రదర్శన ఆ గ్రామంలో ఇరు వర్గాల మధ్య పంచాయితీని తెచ్చిపెట్టింది.

25 నుంచి వాలీబాల్ టోర్నమెంట్

ఇబ్రహీంపట్నం: హనుమాన్ ట్రోఫీ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఈ నెల 25 నుంచి నిర్వహించనున్నట్లు హిందూవాహిని ఇబ్రహీంపట్నం శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. బాగ్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, కందుకూరు, అంజానాపూర్, కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు, మహేశ్వరం, మాడ్గుల మండలాల నుంచి ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనవచ్చునన్నారు. 15వ తేదీ లోపు ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఉప్పరిగూడ లేక్ విల్లా వద్ద ఈ పోటీలను నిర్వహిస్తామని వివరించారు.ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.55,555, రూ.22,222, రూ.11,111 అందజేయనున్నట్లు తెలిపారు.

'పాలపిట్ట'లో సైకిల్‌రైడ్



పాలపిట్ట పార్కులో సైకిల్ రైడ్‌లో చిన్నారులు, తల్లిదండ్రులు

- సైకిల్ తొక్కుతూ సందడి చేసిన చిన్నారులు

రాయదుర్గం: కొండాపూర్‌లోని పాలపిట్ట సైక్లింగ్ పార్కులో చిన్నారులు తమ తల్లిదండ్రులతోకలిసి సైకిల్ రైడ్ చేస్తూ సందడి చేశారు. 'హ్యాపీ హైదరాబాద్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిన్నారుల కోసం ఈ ప్రత్యేక సైకిల్ రైడ్‌ను ఏర్పాటు చేశారు. టీఎస్ఎఫ్‌డీసీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ స్కైలాబ్, ఎకో టూరిజమ్ మేనేజర్ సుమన్ జెండా ఊపి రైడ్‌ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించడానికి సైక్లింగ్ ఎంతో దోహదం చేస్తుందన్నారు. సైకిల్ రైడ్‌లో 70 మంది చిన్నారులు పాల్గొని సందడి చేయగా, ఈ కార్యక్రమంలో హెచ్‌బీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'హెల్త్ ఫర్ ఆల్'



కేబీఆర్ పార్కు వద్ద హెల్త్ వాక్ నిర్వహిస్తున్న వైద్యులు

వెంకటేశ్వరకాలనీ: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు హెల్త్ ఫర్ ఆల్ అనే థీమ్‌తో అవగాహన నడక నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షు డు బీఎస్.రావు మాట్లాడుతూ, పబ్లిక్ హెల్త్ సమస్యల పరిష్కారంలో ఇప్పటికే చాలా ప్రగతి సాధించామన్నారు. సాంకేతికపరంగా, వైద్య, మందుల పరంగా కోవిడ్‌ను కూడా తట్టుకొని నిలబడ్డామన్నారు. ప్రారంభంలో కొంత ఇబ్బంది పడ్డప్పటికీ.. ప్రస్తుతం విజయవంతంగా ముందుకు సాగుతున్నామన్నారు. అవగాహన నడకలో సుమారు 400 మంది వైద్యులు పాల్గొన్నారు. ఐఎంఏ సెక్రటరీ విజయారావు, ఫైనాన్స్ సెక్రటరీ, డాక్టర్ రాజేంద్రకుమార్ యాదవ్, డాక్టర్ సంపత్ రావు, డాక్టర్ నర్సింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.